RNI No Tel / 2012 /4241

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..

# హైదరాబాద్ ఎస్టేట్

తెలుగు దిన పత్రిక

THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER

hyderabadestate.co.in

సంపుటి -13 సంచిక - 389 | 31 ఆదివారం మే 2026 | ఎడిటర్: బట్టు లక్ష్మీ నారాయణ | పేజీలు - 6 వెల రూ 5 /--

## దేశరక్షణ కోసం 'ధర్మ హింస' అవసరమే

### : యోగి ఆదిత్యనాథ్



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దేశ భద్రత, అహింస, ధర్మరక్షణపై కీలక వ్యాఖ్యలు చేశారు. లక్నోలో నిర్వహించిన 'నౌసేన శౌర్య వాటిక' ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ... అహింస మానవాళికి పరమ ధర్మమే అయినప్పటికీ, దేశానికి లేదా సమాజానికి ఎవరైనా ముప్పుగా మారినప్పుడు కేవలం అహింసతోనే సమస్యలు పరిష్కారం కావని స్పష్టం చేశారు. దేశాన్ని, ధర్మాన్ని కాపాడే క్రమంలో అవసరమైతే బలప్రయోగం లేదా 'ధర్మ హింస' చేయడం కూడా అంతే ముఖ్యమన్నారు. బలహీనులను ప్రపంచం ఎప్పుడూ గౌరవించదని, భద్రతాపరంగా శక్తివంతమైన దేశాలతోనే ఇతర దేశాలు స్నేహాన్ని కోరుకుంటాయని యోగి పేర్కొన్నారు. శాంతిభద్రతలు సజావుగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని చెబుతూ.. 2017కు ముందు యూపీలో మాఫియా ఆధిపత్యం, నేరాలు ఎక్కువగా ఉండేవని, బీజేపీ పాలనలో శాంతిభద్రతలు పూర్తిగా మెరుగయ్యాయని గుర్తుచేశారు. దేశ సరిహద్దుల్లో అహర్నిశలు శ్రమిస్తూ భారతదేశాన్ని కాపాడుతున్న సైనికుల త్యాగాలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని సీఎం యోగి ఆదిత్యనాథ్ పిలుపునిచ్చారు.

## నాలుగు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారు

### : కేటీఆర్

ముషీరాబాద్ బీఆర్ఎస్ మెంబర్‌షిప్ డ్రైవ్‌లో పాల్గొన్న కేటీఆర్

గ్రామాల్లో జనాలు కాంగ్రెస్ ను దారుణంగా తిడుతున్నారని వ్యాఖ్య

కరెంటు కూడా సరిగా ఇవ్వడం లేదని విమర్శ



తెలంగాణలో అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ సెగలు మరింత రాజుకున్నాయి. ముషీరాబాద్ నియోజకవర్గంలో నిర్వహించిన బీఆర్ఎస్ మెంబర్‌షిప్ డ్రైవ్‌లో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని, కాంగ్రెస్ ప్రభుత్వంపై తనదైన శైలిలో విమర్శల జడివాన కురిపించారు.

ఎన్నికల ముందు కాంగ్రెస్ నేతలు మాట్లాడిన మాటలను గుర్తుచేస్తూ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "కాంగ్రెస్ వస్తే రైతుబంధు నిలిచిపోతుందని గతంలో కేసీఆర్ చెబితే.. 'మేమేమన్నా దీవానాగాళ్లమా.. మాకు ధిమాక్ లేదా' అని ఒకాయన మాట్లాడారు. మరి ఇవాళ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటుతున్నా, ఇప్పటికే నాలుగుసార్లు రైతుబంధును ఎగ్గొట్టారు. మరి ఇప్పుడు నిన్ను దీవానాగాడు అంటే తప్పా? ధిమాక్ లేనోడు అంటే తప్పా?" అంటూ కేటీఆర్ ప్రశ్నించారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజలు తాను తిట్టిన తిట్ల కంటే ఎక్కువగా కాంగ్రెస్ నేతలను తిడుతున్నారని, ఎక్కడైనా దొరికితే తన్నేలా ఉన్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో వడ్లు కొనడం లేదని, యూరియా ఇవ్వడం లేదని మండిపడ్డారు. రైతులు కష్టపడి పంట పండిద్దామంటే అటు రైతుబంధు వేయడం లేదని, ఇటు కరెంట్ కూడా సరిగ్గా ఇవ్వడం లేదని, గ్రామాల్లో రైతులు చెప్పలేని గోస పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో పొరపాటున కాంగ్రెస్ పార్టీకి ఓటేసిన జిల్లాల ప్రజలంతా ఇవాళ తిరుగుబాటు మూడ్‌లో ఉన్నారని కేటీఆర్ స్పష్టం చేశారు. మళ్లీ ఎన్నికలు ఎప్పుడు వస్తాయా.. ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎప్పుడెప్పుడు తరిమికొడదామా అని ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

## గాదె వెంకటరెడ్డి మృతిపై రేవంత్ సంతాపం



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకుడు గాదె వెంకటరెడ్డి (85) మరణం పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. గత కొంతకాలంగా వయోభారంతో కూడిన అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన, శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కన్నుమూశారు. ఆయన మృతి పట్ల రేవంత్ రెడ్డి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.


## మోదీ 'విశ్వగురు' అంటుంటారు కానీ ఒక్క పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు

### : రాహుల్ గాంధీ





- సీయూఈటీ యూజీ 2026 పరీక్షలో సాంకేతిక లోపం
- పలు కేంద్రాల్లో రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభం
- సమస్యను పరిష్కరించామని, అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ప్రకటన
- విద్యా వ్యవస్థను నాశనం చేస్తున్నారంటూ కేంద్రంపై రాహుల్ గాంధీ ఆగ్రహం

## కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితిపై బండారు దత్తాత్రేయ ఆందోళన



మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ గోదావరిఖనిలో పర్యటించిన సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిన ఉదంతంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఇప్పటికే ఒక స్పష్టమైన నివేదికను ఇచ్చిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. దాదాపు లక్ష కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుతం రైతులకు గానీ, ప్రజలకు గానీ ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని దత్తాత్రేయ విమర్శించారు. ఇంత పెద్ద ప్రాజెక్టు నిరుపయోగంగా మారినప్పటికీ, దానికి అవసరమైన అత్యవసర మరమ్మతులు చేపట్టడంలో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వానికి సరైన చిత్తశుద్ధి కనిపించడం లేదని ఆయన ఆరోపించారు. ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకపోవడం వల్ల జరుగుతున్న నష్టాన్ని దత్తాత్రేయ వివరించారు. కాళేశ్వరం నీటిపై ఆధారపడిన ఉత్తర తెలంగాణ జిల్లాల రైతులు ప్రస్తుతం సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మూడు ప్రధాన బ్యారేజీల్లో ప్రస్తుతం బొట్టు నీరు కూడా లేకపోవడం అత్యంత ఆందోళనకరమైన విషయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా కాలయాపన చేయకుండా తక్షణమే స్పందించి, కాళేశ్వరం ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిపుణుల సూచనల మేరకు పనులను వేగవంతం చేసి, ఉత్తర తెలంగాణ రైతాంగానికి సాగునీరు అందించే బాధ్యతను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్వీకరించాలని బండారు దత్తాత్రేయ హితవు పలికారు.

## బాబా రాందేవ్‌కు షాక్.. పతంజలి ఉత్పత్తులు సీజ్



ప్రముఖ యోగా గురు బాబా రాందేవ్‌కు చెందిన పతంజలి బ్రాండ్ ఉత్పత్తులకు మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎఫ్‌డీఏ) షాక్ ఇచ్చింది. నివారణ అంటూ తప్పుదోవ పట్టించే, అభ్యంతరకరమైన ప్రకటనలు ఇస్తున్నారన్న ఆరోపణలతో ఎఫ్‌డీఏ రాష్ట్రవ్యాప్తంగా దాడులు నిర్వహించి భారీగా మందులను స్వాధీనం చేసుకుంది. సీజ్ చేసిన ఆయుర్వేద, అల్లోపతి మందుల విలువ సుమారు రూ. 73.24 లక్షలు ఉంటుందని అధికారులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఈ మందుల్లో పతంజలి బ్రాండ్‌తో విక్రయిస్తున్న ఉత్పత్తులు కూడా ఉన్నాయి.

డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమెడీస్ (అభ్యంతరకరమైన ప్రకటనలు) చట్టం కింద ఈ చర్యలు తీసుకున్నట్లు ఎఫ్‌డీఏ వెల్లడించింది. ముంబై, కొంకణ్, పుణె, నాసిక్, అమరావతి, నాగ్‌పుర్, ఛత్రపతి శంభాజీనగర్ డివిజన్లలో ఏకకాలంలో ఈ దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో పతంజలి బ్రాండ్ కింద మార్కెటింగ్ చేస్తున్న, హరిద్వార్‌లోని దివ్య ఫార్మసీ తయారు చేసిన మందులను కూడా పెద్ద ఎత్తున స్వాధీనం చేసుకున్నారు. ముఖ్యంగా నాగ్‌పూర్ డివిజన్‌లో రూ. 7,26,755 విలువైన మందులను, నాసిక్ డివిజన్‌లో రూ. 7,10,945 విలువైన స్టాక్‌ను సీజ్ చేసినట్లు అధికారులు వివరించారు. ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రకటనల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని ఎఫ్‌డీఏ స్పష్టం చేసింది.

## మేనల్లుడిపై దాడి... బీజేపీపై మమతా బెనర్జీ ఆగ్రహం




పశ్చిమ బెంగాల్‌లోని సౌత్ 24 పరగణాల జిల్లా సోనార్‌పూర్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) ప్రధాన కార్యదర్శి, లోక్‌సభ ఎంపీ అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడి తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనకు రాష్ట్రంలోని బీజేపీ ప్రభుత్వమే బాధ్యత వహించాలని టీఎంసీ అధినేత్రి, మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తీవ్రంగా ఆరోపించారు. శనివారం సాయంత్రం మమతా బెనర్జీ సోషల్ మీడియాలో స్పందిస్తూ, "పాలకులు హంతకులుగా మారారు. బీజేపీ సిగ్గుపడాలి" అంటూ ఘాటుగా వ్యాఖ్యానించారు. అభిషేక్ బెనర్జీపై జరిగిన దాడికి సంబంధించిన వీడియోను కూడా ఆమె తన పోస్టులో పంచుకున్నారు. ఎన్నికల హింసలో ప్రాణాలు కోల్పోయిన సంజూ కర్మాకర్ కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన అభిషేక్‌పై బీజేపీ మద్దతు ఉన్న దుండగులు దాడికి పాల్పడ్డారని టీఎంసీ ఆరోపించింది. ఈ దాడిని కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తీవ్రంగా ఖండించారు. ప్రతిపక్ష నేతకు ఉద్దేశపూర్వకంగానే సరైన పోలీస్ భద్రత కల్పించలేదని, ఇది బీజేపీ ప్రతీకార రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. ప్రతిపక్ష నేతలకు భద్రత కల్పించాలని, ఇలాంటి దాడులను నివారించాలని ఆయన రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత, యూపీ ప్రతిపక్ష నేత అఖిలేష్ యాదవ్ కూడా ఈ ఘటనపై స్పందించారు. టీఎంసీ కీలక నేతపై జరిగిన ఈ దాడి, బెంగాల్‌లోని బీజేపీ ప్రభుత్వం ద్వేషపూరిత, హింసాత్మక రాజకీయాలు మాత్రమే చేయగలదని నిరూపించిందన్నారు. సున్నితమైన వాతావరణంలో పోలీసుల గైర్హాజరు వెనుక పెద్ద కుట్ర ఉందని ఆయన ఆరోపించారు.

# బాలికల కలలకు రెక్కలు... సాధికారతే లక్ష్యం

# స్నేహ బాలికల సదస్సులో సీతక్క పిలుపు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 30:-

రంగారెడ్డి జిల్లా: కిశోర బాలికలు విద్య, ఆరోగ్యం, నాయకత్వ లక్షణాలతో ముందుకు సాగితేనే సమాజం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.
99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మహిళా వారోత్సవాల సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలల మాక్ పార్లమెంట్ స్నేహ కౌమార బాలికల బాలల హక్కుల సదస్సు లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సీతక్క మాట్లాడుతూ:
అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫాంలు, విద్యారంభ ధ్రువపత్రాల పంపిణీ. కిశోర బాలికల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించే కార్యక్రమాలపై అవగాహన. విద్యతో పాటు క్రమశిక్షణ, విలువలు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని సూచన. సెల్‌ఫోన్‌ను విజ్ఞాన సాధనంగా ఉపయోగించుకోవాలని, సోషల్ మీడియాకు బానిస కాకూడదని సూచన. పోషకాహారం తీసుకోవడం, ఫాస్ట్‌ఫుడ్‌కు దూరంగా ఉండడం ద్వారా ఆరోగ్య పరిరక్షణపై అవగాహన. మహిళా సంఘాల ద్వారా ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం చేపడుతున్న చర్యల వివరాలు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది బాలికలు "స్నేహ" కార్యక్రమంలో భాగస్వాములవుతున్నట్లు వెల్లడి.
బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పిలుపు.
జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్నేహ గ్రూపులు బాలికల్లో నాయకత్వం, సామాజిక బాధ్యత, మంచి అలవాట్లను పెంపొందించే వేదికలుగా నిలుస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి విద్యే ప్రధాన మార్గమని పేర్కొన్నారు. బాలికలు చదువుకు దూరం కాకుండా సంఘాలు, తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మాక్ పార్లమెంట్‌లో విద్య, ఆరోగ్యం, హోం శాఖలకు సంబంధించిన అంశాలపై బాలికలు చర్చించి తమ ప్రతిభను ప్రదర్శించారు. స్పీకర్, మంత్రుల పాత్రల్లో స్నేహ సంఘాల సభ్యులు ఆకట్టుకున్నారు. అక్షరాస్యత కార్యక్రమంలో భాగంగా చదువు నేర్చుకున్న అభ్యాసకులు, వారికి శిక్షణ ఇచ్చిన వాలంటీర్లకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిత రామచంద్రన్, సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్, డైరెక్టర్ శృతి ఓజా, జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్మయి, విమెన్ కమిషన్ సభ్యురాలు సదాలక్ష్మి, పీడీ డీఆర్డీఏ శ్రీలత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, డీపీఓ సురేశ్ మోహన్, పీడీ మెప్మా వెంకటనారాయణ, అడల్ట్ ఎడ్యుకేషన్ డిప్యూటీ డైరెక్టర్ అనిత, స్నేహ సంఘాల సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మహేశ్వరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్

## ప్రజలకు మరింత చేరువయ్యే పోలీసింగ్‌పై దిశానిర్దేశం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 30:-
రంగారెడ్డి జిల్లా: ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి, ఐపీఎస్, శనివారం మహేశ్వరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి పోలీస్ స్టేషన్ పనితీరు, శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నివారణ చర్యలు, రికార్డుల నిర్వహణ, ప్రజల ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను పరిశీలించిన కమిషనర్, అధికారులు, సిబ్బందితో సమావేశమై వారి రోజువారీ విధులు, పోలీసింగ్ ప్రమాణాలు, ప్రజలకు అందిస్తున్న సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు.
సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడిన కమిషనర్, విధుల నిర్వహణలో క్రమశిక్షణ, వృత్తిపరమైన నైపుణ్యం, అంకితభావంతో పనిచేయాలని సూచించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు వెంటనే స్పందించడంతో పాటు, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి వ్యక్తిని గౌరవంగా, మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రజా స్నేహపూర్వక పోలీసింగ్ ద్వారా ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించాలని సూచించారు.
నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని, క్రమం తప్పకుండా గస్తీ నిర్వహించాలని, రౌడీషీటర్ల కదలికలను నిశితంగా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. అలాగే అనుమానాస్పద కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని, కేసుల దర్యాప్తును వేగవంతం చేసి సకాలంలో పరిష్కరించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ రికార్డులను సక్రమంగా నిర్వహించడంతో పాటు, శాఖలోని వివిధ విభాగాల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు. రాత్రి వేళల్లో ప్రత్యేక అప్రమత్తత పాటిస్తూ బీట్ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేయాలని, భద్రతా చర్యలను పటిష్టం చేసి అవాంఛనీయ ఘటనలను అరికట్టాలని సూచించారు.
ఆధునిక సాంకేతికతను పోలీసింగ్‌లో సమర్థవంతంగా వినియోగించుకోవాలని, పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో పరిశుభ్రత, క్రమశిక్షణను పాటించాలని, ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని కమిషనర్ సూచించారు.
మహేశ్వరం పోలీస్ స్టేషన్ సిబ్బంది శాంతిభద్రతల పరిరక్షణలో చేస్తున్న కృషిని కమిషనర్ అభినందిస్తూ, ఇదే నిబద్ధతతో సేవలు కొనసాగించాలని ప్రోత్సహించారు.
ఈ కార్యక్రమంలో మహేశ్వరం పోలీస్ స్టేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# అంగన్వాడీ చిన్నారులకు ఘన స్నాతకోత్సవం

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 30:-

మహేశ్వరం, మహేశ్వరం ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అమీర్‌పేట్ సెక్టార్‌లో శనివారం చిన్నారుల స్నాతకోత్సవ వేడుకను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా, మహిళా వారోత్సవాల సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ సూపర్వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీ-స్కూల్ విద్యను పూర్తి చేసి ప్రాథమిక పాఠశాలలో తొలి తరగతిలో ప్రవేశించనున్న 3 నుంచి 5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులను ప్రత్యేకంగా సత్కరించారు. గ్రామ సర్పంచ్ మల్లమ్మ చిన్నారులకు పట్టాలు అందజేసి వారి విద్యాభ్యాసంలో కొత్త దశకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే విద్యార్థులకు యూనిఫాంలను కూడా పంపిణీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో అందిస్తున్న ప్రాథమిక విద్యా ప్రమాణాలను మరింతగా ప్రోత్సహించడంతో పాటు, ప్రభుత్వ విద్యా వ్యవస్థపై తల్లిదండ్రుల్లో విశ్వాసాన్ని పెంపొందించేందుకు మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.
ఈ వేడుకలో ఉపసర్పంచ్ చంద్రకళ, ఏఎన్ఎంలు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా వర్కర్లు, గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.





## మోదీ 'విశ్వగురు' అంటుంటారు కానీ ఒక్క పరీక్షను సరిగ్గా నిర్వహించడం లేదు: రాహుల్ గాంధీ

దేశవ్యాప్తంగా పలు కేంద్రాల్లో ఇవాళ కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్ (సీయూఈటీ యూజీ) 2026 పరీక్షల్లో సాంకేతిక లోపం తలెత్తింది. దీనివల్ల రెండో షిఫ్ట్ పరీక్ష ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సమస్యను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ధృవీకరించింది. ఇంతకుముందు నీట్ (యూజీ) పరీక్ష లీకైంది. ఈ నేపథ్యంలో లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. దేశాన్ని విశ్వగురువుగా మారుస్తున్నామని ప్రధాని చెబుతుంటారని, కానీ కనీసం ఒక్క పరీక్షను కూడా సజావుగా నిర్వహించడం లేదని విమర్శించారు. సర్వర్ లోపం కారణంగా కొన్ని పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 3 గంటలకు జరగాల్సిన పరీక్షను సాయంత్రం 4 గంటలకు ప్రారంభించారు. విద్యార్థులను మధ్యాహ్నం 2:30 గంటల నుంచి కేంద్రాల్లోకి అనుమతించారు. సాంకేతిక సమస్యను పరిష్కరించామని, పరీక్ష సమయం కోల్పోయిన విద్యార్థులకు నష్టపరిహారంగా అదనపు సమయం ఇస్తామని ఎన్టీఏ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఘటనపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సామాజిక మాధ్యమ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. గతంలో జరిగిన ఇతర పరీక్షల వైఫల్యాలను ప్రస్తావిస్తూ, "నీట్, సీబీఎస్ఈ, ఎస్సెస్సీ, ఈరోజు సీయూఈటీ. నాలుగు పరీక్షలు. కోటి మంది విద్యార్థులు. కానీ ఒక్కదాన్నీ నిజాయితీగా నిర్వహించలేకపోయారు" అని ఆయన ఆరోపించారు. భారత్‌ను 'విశ్వగురువు'గా మారుస్తున్నామని చెబుతూనే, మరోవైపు ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేస్తోందని రాహుల్ మండిపడ్డారు. దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న జాతీయస్థాయి పరీక్షల నిర్వహణలో పదేపదే తలెత్తుతున్న సమస్యలు, పారదర్శకత లోపంపై ఈ ఘటన మరోసారి ఆందోళనలను రేకెత్తించింది.



## వివో ఏలా13రోజుల సమ్మెలో తుమ్మలూరు సర్పంచ్ తుమ్మేటి ఆండాలు కృష్ణ యాదవ్

హైదరాబాద్ స్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి మే 30
మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రాలలో తుమ్మలూరు గ్రామ సర్పంచ్ తుమ్మటి ఆండాలు కృష్ణ యాదవ్ ఉప సర్పంచ్ సంగారెడ్డి వివో ఏళ్లకు మద్దతుగా నిలిచి ప్రభుత్వం వరకు తీసుకెళ్లి వివో ఎలా డిమాండ్లను పరిష్కారం అయ్యేంతవరకు మా వంతు బాధ్యతగా సమ్మెలో పాలు పంచుకుంటామని మాట ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో రెండవ వార్డు శివకుమార్ మూడో వార్డు మెంబర్ రాజేశ్వరి 9వ వార్డు మెంబర్ కాజా మియా చోటు కడారి దుర్గాప్రసాద్ పాల్గొనడం జరిగింది




## నేడు మహేశ్వరం మండలంలో విద్యుత్ అంతరాయం

( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి మే 30:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలోని విద్యుత్ అంతరాయం ఉంటుందని మహేశ్వరం ఏ ఈ చక్రపాణి మాట్లాడుతూ 31.05.2026 ఆదివారం రోజు 33/11కేవీ ఫ్యాబ్ సిటీ నందు 8 ఎంవిఏ పవర్ ట్రాన్స్ఫర్మర్ స్థానంలో 12.5 ఎంవిఏ పవర్ ట్రాన్స్ఫర్మర్ అమర్చుటకు గాను ఉదయం 8గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు ఫాబిసిటీ లోని ఇండస్ట్రీ ఏరియాలో విద్యుత్ అంతరాయం ఉంటుంది. విద్యుత్ మహేశ్వరం ఏఈ చక్రపాణి మీడియాకు తెలియపరిచారు



# కార్మిక హక్కుల సాధనలో సీఐటీయూ పోరాటాలు చిరస్మరణీయం

### 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన డి. కిషన్, కార్మికులు.



హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 30:-
బ్రాహ్మణపల్లి: సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిహెచ్ఎంసి ఆదిభట్ల సర్కిల్ పరిధిలోని తుర్కయంజాల్, తొర్రూరు డివిజన్ల కార్మికులు శనివారం బ్రాహ్మణపల్లి చౌరస్తాలోని ఆటో స్టాండ్ వద్ద ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు డి. కిషన్ సంఘ జెండాను ఆవిష్కరించి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకుంటూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఉత్సాహభరితంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డి. కిషన్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల పరిరక్షణ, శ్రమజీవుల సంక్షేమం, సామాజిక న్యాయం కోసం సీఐటీయూ గత ఐదు దశాబ్దాలుగా నిరంతర పోరాటాలు సాగిస్తోందన్నారు. కార్మిక వ్యతిరేక విధానాలు, ప్రైవేటీకరణ, పెట్టుబడిదారీ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్వహిస్తూ కార్మిక వర్గానికి అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. 1970 మే 30న స్థాపించబడిన సీఐటీయూ, అప్పటి నుంచి పారిశ్రామిక, అసంఘటిత, ప్రభుత్వ రంగ కార్మికులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి వేతనాల పెంపు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రతా పథకాల అమలు, కార్మిక చట్టాల పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఏ. మాధవరెడ్డి, తుర్కయంజాల్ ఆటో ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు గుడ్ల వినోద్ కుమార్, ఉపాధ్యక్షుడు రాజు, కోశాధికారి శేఖర్ రెడ్డి, ఆటో డ్రైవర్లు నాగరాజు, యాదగిరి, రామకృష్ణారెడ్డి, మహేష్, నరసింహ, బీరప్ప, యాదయ్య, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపీడీవో డిప్యూటీ సీఈవోగా శైలజ రెడ్డి ఎన్నికైన సందర్భంగా సన్మానించిన అండాలు కృష్ణ యాదవ్



( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి మే 30:)
రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలో మహేశ్వరం మండల కేంద్రంలో.. మాజీ ఎంపీడీవో డిప్యూటీ సీఈవో గా వెళ్తున్న సందర్భంగా.. తుమ్మలూరు గ్రామ సర్పంచ్ అండాలు కృష్ణ యాదవ్ మరియు ఉపసర్పంచ్ సంగారెడ్డి రెండవ వార్డ్ మెంబర్ శివకుమార్ మూడవ వార్డు మెంబర్ రాజేశ్వరి 9 వ వార్డు మెంబర్ కాజా మియా చోటు తుమ్మలూరు గ్రామపంచాయతీ సెక్రటరీ అలివేలు తదితరులు యొక్క కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది



ప్రెస్ నోట్



ఈరోజు ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ గారిని ఎస్సీ డిపార్ట్మెంట్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ ఎస్సీ డిపార్ట్మెంట్ నాయకులకు జరిగిన అన్యాయంపై నాయకులు ఆమె దృష్టికి తీసుకెళ్లి వినతిపత్రం సమర్పించారు. సమస్యలను ఓర్పుగా విన్న మీనాక్షి నటరాజన్ గారు సానుకూలంగా స్పందించి, పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న ఎస్సీ నాయకులకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని, వారికి తగిన గుర్తింపు మరియు ప్రాధాన్యత కల్పించే విషయాన్ని పరిశీలిస్తానని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో గంట శ్రవణ్ కుమార్ (తెలంగాణ రాష్ట్ర ఎస్సీ డిపార్ట్మెంట్ ఉపాధ్యక్షులు), ఈరిగి రమేష్ (ఎల్బీనగర్ నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్), సంపెర్ల అడెల్లు (తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్), బిక్కి గంగన్న (జైనథ్ మండల అధ్యక్షుడు), మేకల జితేందర్ (కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్, ఆదిలాబాద్)తో పాటు ఎస్సీ డిపార్ట్మెంట్ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## జూన్ 3న సీఎంగా డీకే శివకుమార్ ప్రమాణ స్వీకారం...

## అది చాలా మంచి రోజన్న వాస్తు నిపుణుడు



డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసేందుకు ముహూర్తం ఖరారైంది. జూన్ 3వ తేదీ సాయంత్రం 5:15 గంటలకు ఆయన సీఎంగా బాధ్యతలు చేపట్టనున్నారు. వాస్తు నిపుణులు గురూజీ ఆరాధ్య స్వయంగా ఈ ముహూర్తాన్ని నిర్ణయించినట్లు శనివారం ప్రకటించారు. శివకుమార్ నివాసం వద్ద మీడియాతో మాట్లాడిన గురూజీ ఆరాధ్య, జూన్ 3 బుధవారం రోజు వృశ్చిక లగ్నంలో ప్రమాణ స్వీకారానికి శుభప్రదంగా ఉంటుందని తెలిపారు. వాస్తవానికి జూన్ 5వ తేదీని పరిశీలించినా, ఆ రోజు ఓ ముఖ్యమైన వ్యక్తి అందుబాటులో ఉండరన్న కారణంతో జూన్ 3ని ఖరారు చేసినట్లు ఆయన వివరించారు. శివకుమార్ జాతకానికి సంబంధించిన జ్యోతిష్యపరమైన అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో డీకే శివకుమార్ బెంగళూరులోని అజ్జయ్య మఠాన్ని సందర్శించి స్వామీజీ ఆశీస్సులు తీసుకున్నారు. గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌ను కలిసిన అనంతరం ఆయన స్వామీజీతో భేటీ అయినట్లు సమాచారం. మరోవైపు, కాంగ్రెస్ శాసనసభాపక్ష నేతగా డీకే శివకుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సిద్ధరామయ్య సీఎల్పీ నేతగా (తదుపరి సీఎంగా) డీకేఎస్ పేరును ప్రతిపాదించగా, కాంగ్రెస్ సభ్యులు బలపరిచారు.

## సిఐటీయు 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




సిఐటియు 56వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిఐటియు అనకాపల్లి కార్యాలయంలో మండల కన్వీనర్ కాళ్ళ తేలయ్యబాబు జెండాను ఎగరవేశారు. ఈసందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సంభ్యులు జి. కోటేశ్వరరావు మాట్లాడుతూ సిఐటియు ఏర్పడి 56 సంవత్సరాల్లో అనేక సమస్యలుపై పోరాటాలు చేసిందని కార్మికుల హక్కుల కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. 1970 మే 30న స్థాపించబడిన సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) కార్మిక వర్గ హక్కుల పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల రక్షణ, మత సామరస్య పరిరక్షణ, సామాజిక న్యాయం సాధన లక్ష్యాలతో దేశ కార్మిక ఉద్యమంలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. స్థాపన నాటి నుంచి సీఐటీయూ కేవలం వేతనాలు, ఉద్యోగ భద్రత కోసం మాత్రమే కాకుండా కార్మికుల్లో సామాజిక, రాజకీయ చైతన్యాన్ని పెంపొందించేందుకు కృషి చేసిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్లు, కాంట్రాక్టు మరియు ఔట్‌సోర్సింగ్ విధానాలకు వ్యతిరేకంగా నిరంతరం పోరాటాలు నిర్వహిస్తూ కార్మిక వర్గ ప్రయోజనాలను కాపాడుతోందని పేర్కొన్నారు. దేశంలోని వివిధ కార్మిక సంఘాలను ఐక్యం చేసి ఉమ్మడి పోరాటాలకు నాయకత్వం వహించడం సీఐటీయూ ప్రత్యేకత అని అన్నారు. నేటి పరిస్థితుల్లో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, అసంఘటిత రంగ శ్రామికులు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం మరింత పెరిగిందని అన్నారు. కార్మిక వర్గ ఐక్యతను బలోపేతం చేస్తూ, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడి, సామాజిక న్యాయం మరియు సమసమాజ నిర్మాణం కోసం సీఐటీయూ తన ఉద్యమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తుందని తెలిపారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ కేంద్రంలో అధికారులు ఉన్న బిజెపి నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాయాలని చూస్తుందని, సిఐటియు కార్మికులకు అండగా నిలుస్తూ సమరశీల పోరాటాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. జిల్లాలో స్పెషల్ ఎకామిక్ జోన్స్, ఫార్మా, సిమెంట్ కంపెనీలో కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయలేదని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం గత 15 సంవత్సరాల నుండి కనీస వేతనాలను నిర్ణయించకుండా కార్పొరేట్లు కొమ్ముకాస్తుందన్నారు. దీంతోనే దేశంలో అనేక చోట్ల కార్మికుల స్వచ్ఛందంగా రోడ్లపై కొచ్చి ఆందోళన నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ముఠా కార్మికులకు, అసంఘటన కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని డిమాండ్ చేశారు. స్కిమ్ వర్క్ కి కనీస వేతనాలు ఇవ్వాలని, మున్సిపల్ కార్మికులకు వారి యొక్క సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్, కాళ్ల తేలయ్యబాబు, ఏ రాజు, అజయ్, నూకరాజు, ఈశ్వరరావు, నూక అప్పారావు తదితరులు పాల్గొన్నారు

# తెలంగాణ ఉద్యమం ఆత్మగౌరవ పోరాటం..

### ఉద్యమకారుల గుర్తింపే అసలైన నివాళి

### త్యాగాలతో సాధించిన తెలంగాణకు ఉద్యమకారుల సంక్షేమమే తదుపరి లక్ష్యం




హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 30:-

హైదరాబాద్:- భాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చర్చాగోష్టి కార్యక్రమం ఉద్యమకారుల హక్కులు, గుర్తింపు, సంక్షేమ అంశాలపై విస్తృతంగా చర్చలకు వేదికగా నిలిచింది. ఈ సమావేశానికి ఎమ్మెల్సీ కోదండరాం, ప్రభుత్వ ప్రతినిధి మోతే శోభన్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కార్యక్రమానికి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాచం సత్యనారాయణ అధ్యక్షత వహించారు. సభలో మాట్లాడిన డాక్టర్ కాచం సత్యనారాయణ తెలంగాణ ఉద్యమం కేవలం పెన్షన్లు లేదా ఇంటి స్థలాల కోసం సాగలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర సాధన కోసం తొలి దశ ఉద్యమం నుంచి మలిదశ పోరాటం వరకు నీళ్లు, నిధులు, నియామకాల సాధనతో పాటు భవిష్యత్ తరాల అభ్యున్నతే ప్రధాన లక్ష్యంగా నిలిచిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి వేలాది మంది ఉద్యమకారుల త్యాగాలు, అంకితభావం కారణమయ్యాయని పేర్కొన్నారు. సమాజంలోని కార్మికులు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, రాజకీయ నాయకులు, కళాకారులు ఇలా అన్ని వర్గాల సమిష్టి కృషి వల్లే తెలంగాణ రాష్ట్రం సాధ్యమైందని చెప్పారు.

ఉద్యమకారులు తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాకుండా ప్రాంత భవిష్యత్తు కోసం పోరాడారని గుర్తు చేశారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా ఉద్యమ స్ఫూర్తిని కొనసాగించేలా యువత ఆత్మగౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన వారిని అధికారికంగా గుర్తించి తగిన గౌరవం కల్పించాలని కోరారు. ఎమ్మెల్సీ కోదండరాం, మోతే శోభన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ఏర్పాటుతో తెలంగాణ ప్రజల ఆకాంక్షల్లో కొంత మేర నెరవేర్పు జరిగిందని పేర్కొన్నారు.

ఉద్యమకారుల సమస్యలను సమగ్రంగా పరిశీలించేందుకు ముఖ్యమంత్రి అధ్యక్షతన ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీలో మంత్రి పొన్నం ప్రభాకర్, అద్దంకి దయాకర్‌తో పాటు పలువురు సభ్యులు ఉన్నారని వివరించారు. ముందుగా ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను పూర్తి చేసి, అనంతరం వారి సంక్షేమం కోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు వెల్లడించారు. విద్య, వైద్యం, ప్రభుత్వ సేవలలో ప్రాధాన్యతతో పాటు మరిన్ని సంక్షేమ చర్యలను అమలు చేసే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవానికి భంగం కలగకుండా తగిన చర్యలు త్వరలోనే చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గ చైర్మన్ బండి మహేష్, స్టీరింగ్ కమిటీ సభ్యుడు మడుపు వేణుగోపాలరావు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ భర్తకి జగన్నాథం, ఆముదాల యాదగిరి, వేదెర సువర్ణ చల్మారెడ్డి, మడుపు గోపాల్, చీమల రామకృష్ణ యాదవ్, వీరమల్ల రామాంజి గౌడ్, బోడ కృష్ణ, డాక్టర్ సూరమోని సత్యనారాయణ, కళాకారుడు రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

## కీబోర్డ్ స్వరాలతో గిన్నిస్ రికార్డులో మెరిసిన మెట్లల్ల చిన్నారులు

### తల్లి ప్రోత్సాహం పిల్లల ప్రతిభ: గిన్నిస్ వరల్డ్ రికార్డులో ఇబ్రహీంపట్నం విద్యార్థుల అరుదైన ఘనత

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 30:-

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని మెట్టిల్ల గ్రామానికి చెందిన ఇద్దరు చిన్నారులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతూ గిన్నిస్ వరల్డ్ రికార్డులో తమ పేర్లు నమోదు చేసుకున్నారు. గుంటి అరుణ కుమార్తెలైన అభిజ్ఞ రోజ్ (10), శ్రీ విజ్ఞ కీబోర్డ్ వాయిద్యంలో ప్రతిభ కనబర్చి ఈ అరుదైన ఘనత సాధించారు.

హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించిన గిన్నిస్ వరల్డ్ రికార్డు కార్యక్రమంలో పలు దేశాల నుంచి సుమారు రెండు వేల మంది కీబోర్డ్ కళాకారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా గంటపాటు నిరంతరాయంగా కీబోర్డ్ వాయిస్తూ తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు.




ప్రదర్శనలో విశేష ప్రతిభ కనబర్చిన 777 మందిని ఎంపిక చేయగా, అందులో అభిజ్ఞ రోజ్, శ్రీ విజ్ఞలు కూడా చోటు దక్కించుకున్నారు.

ఈ విజయాన్ని గుర్తిస్తూ కార్యక్రమ నిర్వాహకుడు అగస్టిన్ దండినీ ఎంపికైన వారికి గిన్నిస్ వరల్డ్ రికార్డు ధృవపత్రాలను అందజేశారు. ప్రస్తుతం అంగన్‌వాడీ టీచర్‌గా సేవలందిస్తున్న గుంటి అరుణ తన ఉద్యోగ బాధ్యతలతో పాటు పిల్లల ప్రతిభాభివృద్ధికి సమయం కేటాయించడం విశేషం. ఆమె అందించిన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం వల్లే చిన్నారులు ఈ స్థాయికి చేరుకున్నారని కుటుంబ సభ్యులు తెలిపారు.

ఈ విజయంతో మెట్టిల్ల గ్రామం, పాఠశాల, కుటుంబ సభ్యులకు గర్వకారణంగా నిలిచిన ఈ చిన్నారులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

## కార్మికుల ఐక్యతే హక్కుల సాధనకు మార్గం : సీఐటీయూ నేతలు

### సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్మిక సమస్యలపై పోరాటాలకు పిలుపు

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 30:-

ఎల్బీనగర్, సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ) 56వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఎల్బీనగర్ కన్వీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పొట్టేపాకు రామస్వామి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం. చంద్రమోహన్, జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సీఐటీయూ గత 55 ఏళ్లుగా నిరంతర పోరాటాలు సాగిస్తూ 56వ సంవత్సరంలోకి అడుగుపెట్టడం గర్వకారణమని పేర్కొన్నారు. దేశంలోని వివిధ రంగాలకు చెందిన కార్మికుల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ అంకితభావంతో పనిచేస్తోందని తెలిపారు. జీహెచ్ఎంసీ కార్మికులు, భవన నిర్మాణ కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది, హమాలీలు, రవాణా రంగం







కార్మికులు, పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల సమస్యలపై సంఘం నిరంతరం పోరాటాలు నిర్వహిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ల వల్ల కార్మికులకు కలిగే ప్రభావాలపై అవగాహన కల్పిస్తూ, వారి హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమాలు కొనసాగిస్తున్నామని తెలిపారు. రానున్న రోజుల్లో కార్మికులకు నష్టం కలిగించే విధానాలు, చట్టాలకు వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఇళ్ల స్థలాలు, గృహాల సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే కార్మికులను సమీకరించి ఎల్బీనగర్ ప్రాంతంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ భూములను గుర్తించి కార్మికుల హక్కుల కోసం ఎర్రజెండా ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో దండు రాధ, బి. కాశయ్య, కృష్ణమూర్తి, రాథోడ్ అంజి, లింగస్వామి, రాధమ్మ, లక్ష్మణ్ నాయక్, గంగమ్మ, అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

## మహేశ్వరం ఎంపీడీవో నుండి డిప్యూటీ సీఈవోగా ఎన్నికైన సందర్భంగా వీడ్కోలు...

( హైదరాబాద్ ఎస్టేట్ మహేశ్వరం ప్రతినిధి కృష్ణ చారి మే 30:)

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గం మహేశ్వరం మండల కేంద్రంలో. ఎంపీడీవో గా మహేశ్వరం మండల కేంద్రంలో ఎన్నో గ్రామాలకు అభివృద్ధి బాటలు వేసిన శైలజ రెడ్డి నేడు డ్యూప్యూటీ సీఈఓ గా పదోన్నతి పై వెళ్తున్న మాజీ ఎంపీడీఓ శైలజ రెడ్డి మరియు నూతనంగా ఎంపీడీఓ బాధ్యతలు చేపట్టిన ఎన్. శారదమ్మా మరియు బదిలీ పై వెళ్తున్న .లాస్ట్ . అశోక్ మరియు జె ఆర్. లాస్ట్ . జి . అమృత మరియు వివిధ మండలాలకు బదిలీ పై వెళ్తున్న పంచాయితీ కార్యదర్శులు..



RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
31 ఆదివారం మే 2026

## ఆడబిడ్డల పెళ్లిళ్లకు భరోసా.. 53 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేత

### సంక్షేమ పథకాలతో కుటుంబాలకు అండగా ప్రభుత్వం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి

### పేద కుటుంబాల పెళ్లి ఖర్చులకు చేయూత.. లబ్ధిదారులకు ఆర్థిక సాయం పంపిణీ

హైదరాబాద్ ఎస్టేట్ ప్రతినిధి మే 30:- ఇబ్రహీంపట్నం, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. శనివారం ఇబ్రహీంపట్నంలోని తన క్యాంపు కార్యాలయంలో మంచాల మండలానికి చెందిన 53 మంది లబ్ధిదారులకు ఈ పథకాల కింద మంజూరైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆడపిల్లల వివాహాల సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక భారం తగ్గించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమన్నారు. ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వివాహం అనేది ప్రతి కుటుంబంలో ఆనందకరమైన వేడుకగా జరగాలని, ఆర్థిక ఇబ్బందులు ఆ సంతోషానికి అడ్డంకిగా మారకూడదనే ఆలోచనతో ఈ పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ప్రభుత్వం అందిస్తున్న సహాయంపై హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ




కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం పట్ల యువత తిరగబడాలి

## : శాప్ ఛైర్మన్ రవినాయుడు



గత ఎన్నికల్లో తమను ఓడించారన్న అక్కసుతోనే నిరుద్యోగ యువతపై వైసీపీ కక్షపూరితంగా వ్యవహరిస్తోందని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (శాప్) ఛైర్మన్ అనిమిని రవినాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అత్యంత పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీపై రాజకీయ దురుద్దేశంతో వైసీపీ తప్పుడు ఆరోపణలు చేస్తోందని మండిపడ్డారు. డీఎస్సీపై వైసీపీ దుష్ప్రచారం పట్ల యువత తిరగబడాలని పిలుపునిచ్చారు. తిరుపతిలో "నిరుద్యోగ యువతపై గొడ్డలివేటు" పేరిట నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి కొత్తగా ఉద్యోగాలకు ఎంపికైన వెయ్యి మందికి పైగా టీచర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ.. వైసీపీ చేస్తున్న దుష్ప్రచారంతో డీఎస్సీలో ఎంపికైన టీచర్లు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని, కష్టపడి ఉద్యోగాలు సాధించిన పేద కుటుంబాల యువత కన్నీళ్లు పెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. "రాజకీయంగా మాతో తలపడాలి కానీ, యువత జీవితాలతో ఆడుకోవడం తగదు. ఐదేళ్లలో ఒక్క టీచర్ పోస్టు భర్తీ చేయని జగన్, ఎన్నికలకు రెండు నెలల ముందు అసమగ్ర డీఎస్సీ ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 150 రోజుల్లో 15,941 మందికి ఉద్యోగాలు ఇచ్చింది. దీన్ని అడ్డుకోవడానికి వైసీపీ నేతలు సుప్రీంకోర్టు వరకు వెళ్లి 150 కేసులు వేశారు" అని రవినాయుడు గుర్తుచేశారు.

స్పోర్ట్స్ కోటాపై విచారణకు సిద్ధం

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు అమ్ముకున్నారన్న ఆరోపణలను రవినాయుడు తీవ్రంగా ఖండించారు. క్రీడాకారులకు సర్టిఫికేట్లు ఇచ్చేది అసోసియేషన్లు, ఫెడరేషన్లేనని, వాటిని ధృవీకరించుకున్నాకే 427 పోస్టులు భర్తీ చేశామని స్పష్టం చేశారు. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా 3 శాతం స్పోర్ట్స్ కోటా అమలు చేస్తే దానిపై నిందలు వేయడం దారుణమన్నారు. తమ హయాంలో, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన స్పోర్ట్స్ కోటా నియామకాలపై ఎటువంటి విచారణకైనా సిద్ధమని ఆయన సవాల్ విసిరారు.

యువత ఏకమై జగన్‌ను తరిమికొట్టాలి: ఎమ్మెల్సీ శ్రీకాంత్

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. లక్షలాది మంది యువత ఆశలపై విషం చిమ్ముతున్న జగన్మోహన్ రెడ్డి నరరూప రాక్షసుడని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. యువత కష్టపడి సాధించిన ఉద్యోగాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న హామీని నిలబెట్టుకుంటామని, రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఏకమై జగన్‌ను తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని అన్నారు.

డ్రైవర్లతో పేపర్లు దిద్దించిన చరిత్ర మీది: ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి

మరో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి మాట్లాడుతూ.. వైసిపి నేతలు యువత ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా మాట్లాడుతున్నారని విమర్శించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో గ్రూప్-1 పేపర్లను మంగళగిరి వద్ద హాయ్ ల్యాండ్‌లో డ్రైవర్లు, పనివాళ్లతో దిద్దించారని సంచలన ఆరోపణలు చేశారు. "అటువంటి చరిత్ర ఉన్న వైసీపీకి, పారదర్శకంగా డీఎస్సీ నిర్వహించిన కూటమి ప్రభుత్వంపై ఆరోపణలు చేసే నైతిక అర్హత ఉందా?" అని ఆయన నిలదీశారు. స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన వారి జాబితాను పబ్లిక్ డొమైన్‌లో పెట్టామని, తప్పు జరిగిందని నిరూపిస్తే బహిరంగ క్షమాపణ చెబుతామని స్పష్టం చేశారు.

## మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీపై తీవ్ర దాడి...

## క్రికెట్ హెల్మెట్ తో తలను కాపాడుకున్న ఎంపీ!

తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) జాతీయ ప్రధాన కార్యదర్శి, లోక్‌సభ ఎంపీ అభిషేక్ బెనర్జీకి పశ్చిమ బెంగాల్‌లో తీవ్ర నిరసన సెగ తగిలింది. సౌత్ 24 పరగణాల జిల్లాలోని సోనార్‌పూర్‌లో శనివారం ఆయనపై స్థానికులు దాడికి పాల్పడ్డారు. కోడిగుడ్లు, రాళ్లతో దాడి చేయడంతో, ఆయన క్రికెట్ హెల్మెట్ ధరించి తనను తాను కాపాడుకోవాల్సి వచ్చింది. అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరిగిన హింసలో బాధితుడైన ఓ పార్టీ కార్యకర్తను పరామర్శించేందుకు అభిషేక్ బెనర్జీ శనివారం సోనార్‌పూర్‌కు బయల్దేరారు. మార్గమధ్యంలో కమల్ గాజీ వద్ద కొంతమంది మహిళలు నల్ల జెండాలతో నిరసన తెలిపారు. అనంతరం సోనార్‌పూర్ చేరుకోగానే వందలాది మంది స్థానికులు, మహిళలు ఆయన్ని చుట్టుముట్టి "దొంగ" అంటూ పెద్ద ఎత్తున



నినాదాలు చేశారు. ఈ క్రమంలో, అభిషేక్ తన కారు దిగి, ఓ స్థానిక టీఎంసీ కార్యకర్త బైక్‌పై గమ్యస్థానానికి చేరేందుకు ప్రయత్నించారు. దీంతో నిరసనకారులు మరింత ఆగ్రహంతో ఆయనపైకి దూసుకొచ్చారు. కొందరు మహిళలు ఆయనపై చేయి చేసుకోగా, మరికొందరు చొక్కా చించివేశారు. ఆయనపైకి కోడిగుడ్లు విసరడంతో, వెంటనే ఆయన తలకి క్రికెట్ హెల్మెట్ పెట్టుకున్నారు. కొందరు రాళు విసిరినప్పటికీ అవి ఆయనకు తగల్లేదు. ఈ ఘటనపై అభిషేక్ తీవ్రంగా స్పందించారు. "ఇది బీజేపీ గూండాల పనే. నా తల హెల్మెట్ వల్ల సురక్షితంగా ఉంది. బెంగాల్‌లో ప్రజాస్వామ్యం ఉందా? నేను దాడికి గురవుతున్నప్పుడు పోలీసులు ఎక్కడా కనిపించలేదు. ఈ విషయంపై కలకత్తా హైకోర్టును ఆశ్రయిస్తా, గవర్నర్‌కు కూడా ఫిర్యాదు చేస్తా" అని ఆయన అన్నారు. మే 4న ఎన్నికల ఫలితాల తర్వాత అభిషేక్ బెనర్జీ బయట కనిపించడం ఇదే తొలిసారి. కాగా, శనివారం మధ్యాహ్నం సీఐడీ అధికారులు ఆయనకు విచారణకు సంబంధించి నోటీసులు జారీ చేసిన కొద్దిసేపటికే ఈ ఘటన జరగడం గమనార్హం.

## బడి పిలుస్తుంది కార్యక్రమానికి అనూహ్య స్పందన

విద్యార్థుల నమోదు పెంపు లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న "బడి పిలుస్తుంది అడ్మిషన్ డ్రైవ్ 2026-27" కార్యక్రమానికి సబ్బవరం మండలంలో అనూహ్య స్పందన లభిస్తోంది. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలం గౌటివాడ లో మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాల లో నిర్వహించిన అడ్మిషన్ డ్రైవ్ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు, మండల విద్యాశాఖ అధికారి-1 శ్యామల లక్ష్మణరావు పాల్గొని విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, సౌకర్యాలపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో సబ్బవరం అగ్రహారం ప్రధానోపాధ్యాయుడు కొటాన కనకరావు, గోటివాడ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.వి.




ఆనంద్, రాజేష్, నూకరాజు, అక్కిరెడ్డి కనకరాజు తదితరులు పాల్గొన్నారు. సాలాపువాని పాలెం గ్రామంలో నిర్వహించిన ఇంటింటి ప్రచార



కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించగా, దాని ఫలితంగా గోటివాడ ప్రాథమిక పాఠశాలలో నలుగురు విద్యార్థులు కొత్తగా చేరారు.

## ఆపరేషన్ దండాయన"తో నేరగాళ్లపై ఉక్కుపాదం....

### జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



ఆంధ్రప్రదేశ్‌లో మహిళలు మరియు బాలికల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, వారిపై జరుగుతున్న నేరాల్లో నిందితులకు త్వరితగతిన శిక్షలు పడేలా పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపడుతోందని అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు, మహిళా & శిశు భద్రత విభాగం ఐజీ రాజకుమారి, పర్యవేక్షణలో... ఏపీ పోలీస్ శాఖ స్పీడ్ ట్రయల్ మానిటరింగ్ విధానాన్ని పకడ్బందీగా అమలు చేస్తోందన్నారు. ఇందులో భాగంగానే నేరాల నియంత్రణకు, నేరస్తులకు త్వరితగతిన శిక్షలు పడేలా చేయడానికి ప్రతిష్టాత్మక ఆపరేషన్ దండాయన ను అధికారికంగా ప్రారంభిస్తున్నట్లు ఆయన ప్రకటించారు.

ఆపరేషన్ దండాయన" ప్రధాన లక్ష్యాలు & పోలీస్ అధికారులకు ఆదేశాలు జీరో టాలరెన్స్ & సత్వర విచారణ మహిళలపై జరిగే నేరాల విషయంలో 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంబించడం. 60 రోజుల్లో చార్జిషీట్ ప్రతి కేసులోనూ నిందితులపై 60 రోజుల్లోగా చార్జిషీట్ దాఖలు చేయాలి. సంచలన కేసులను ఫాస్ట్ ట్రాక్ కోర్టులకు బదిలీ చేసి, నిందితులకు వేగంగా కఠిన శిక్షలు పడేలా చూడాలి. పునరావృత నేరస్తులు, అనుమానితుల కదలికలపై సెక్సువల్ అఫెండర్ సర్వలెన్స్ షీట్స్ ద్వారా నిరంతర నిఘా ఉంచాలి. బాధిత మహిళలకు అవసరమైన కౌన్సిలింగ్, ఉచిత న్యాయ సహాయం అందించాలి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులను పునఃసమీక్షించి, ప్రాధాన్యత క్రమంలో చార్జిషీట్లు దాఖలు చేయాలి. ప్రజా భాగస్వామ్యంతో "సైబర్ వాచ్" కార్యక్రమాన్ని అమలు చేస్తూ, ఇంటెలిజెన్స్ నిఘాను పెంచాలి. సామాజిక కార్యకర్తలతో కలిసి "పరివర్తన సదస్సులు" నిర్వహించాలి. మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృత అవగాహన కల్పించాలి. చట్టాలపై భయం కలిగేలా ఇటీవల కోర్టులు ఇచ్చిన తీర్పులను పాఠశాలలు, కళాశాలల్లో ప్రచారం చేయాలి. మహిళలపై జరిగిన నేరాలలో అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ పక్కా ఆధారాలతో కోర్టుల ద్వారా నిందితులకు శిక్షలు పడేలా చేసింది. అలాగే జిల్లాలో సెక్సువల్ అఫెండర్ సర్వలెన్స్ షీట్స్ 137 మంది పై షీట్స్ తెరిచి, వారిపై పూర్తి నిఘా ఉంచడం జరిగింది. మహిళలపై నేరాలలో (క్రైమ్ అగైనిస్ట్ ఉమెన్) 2024 (10 కేసులు), 2025 (15 కేసులు), 2026 (03 కేసులు) మొత్తం 28 కేసుల్లో నిందితులకు కోర్టు ద్వారా కన్విక్షన్ (శిక్షలు) పడేలా పోలీస్ శాఖ చట్టపరమైన చర్యలు తీసుకుందని స్పష్టం చేశారు. "మహిళలపై నేరాల విషయంలో జీరో టాలరెన్స్ పాలసీ మరియు విధానంతో ముందుకు వెళ్తున్నాం. నిందితులు ఎంతటి ప్రభావశీలురైనా సరే, చట్టం ముందు మోకరిల్లాల్సిందే. ప్రతి బాధితురాలికి పూర్తి న్యాయం జరిగే వరకు 'ఆపరేషన్ దండాయన' నిరంతరం కొనసాగుతుంది. మహిళల భద్రత కోసం పోలీస్ శాఖ తీసుకుంటున్న ఈ చర్యలకు ప్రజలందరూ సహకరించాలినీ జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా పిలుపునిచ్చారు



అనకాపల్లి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయ కర్త మలశాల భరత్ ఆదేశాల అనకాపల్లి జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ సూచనలతో 81 వ వార్డ్ ఇంచార్జ్ రాష్ట్ర గవర కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ కార్యాలయంలో 81 వ వార్డ్ మహిళా కమిటీ పత్రికా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొడ్డేడ దుర్గ లక్ష్మి, 81 వ వార్డ్ మహిళా ప్రెసిడెంట్ సుధా మాట్లాడుతూ వైయస్సార్ గవర్నమెంట్ ఏర్పడిన తర్వాత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం లో మహిళలు కు ఎన్నో పథకాలు పెట్టి ఆర్థికంగా సపోర్ట్ చేసారు. అలాగే డ్వాక్రా రుణాలు మాఫీ చేసి మహిళలకు ఎంతో మందికి చేసారు . అమ్మ ఒడి పథకం తో పిల్లల తల్లిదండ్రులుకు 15000 ఇచ్చి అన్న మాట నిలబెట్టు కున్నారు అని అన్నారు. 81 వ వార్డ్ ఇంచార్జ్ బొడ్డేడ శివ మాట్లాడుతూ కరోనా లాంటి కష్ట సమయంలో యిచ్చిన ప్రతి హామీ జగన్ నెరవేర్చారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం 18 నెలలు దాటిన ప్రతి మహిళకి నెలకు 1500 ఇస్తానని చెప్పి ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు అయిన ఇప్పటికీ హామీ నెరవేర్చ కుండా మహిళామతల్లులను మోసం చేస్తున్నారని అన్నారు. 50 సంవత్సరాల దాటిన బీసీ ఎస్సీ ఎస్టీ మహిళలకు పెన్షన్ యిస్తాను అని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చి అవి నెరవేర్చకుండా చేయడం ప్రజలను మోసం చేయడం కింద వస్తుందని తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి వైయస్సార్సీపి లీగల్ సెల్ ప్రెసిడెంట్ కోరిబిల్లి యుగంధర్, పట్టణ బీసీ సెల్ ప్రెసిడెంట్ దొడ్డి హరి, 81 వ వార్డ్ మహిళా జనరల్ సెక్రటరీలుకాంద్రేగుల లావణ్య, సూరిశెట్టి సుశీల పాల్గొన్నారు.

## ప్రశాంతమైన వాతావరణంలో ఎస్ ఎస్ సి సప్లిమెంట్ భౌతిక శాస్త్రం పరీక్షలు



జిల్లా లో పదవ తరగతి సప్లమెంటరీ పరీక్షలు శనివారం నాడు భౌతిక శాస్త్రం పరీక్ష నిర్వహించారని జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. గణితం పరీక్షకుకు15 పరీక్షా కేంద్రాలలో నందు 1259 మందికి గాను 1087 మంది హాజరయ్యారని 172 మంది పరీక్షకు హాజరు కాలేదన్నారు. ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం అమరావతి వారు నిర్వహించిన ఓపెన్ స్కూల్ ఎస్ సి మరియు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షకు ఏడు పరీక్ష కేంద్రాలను 377 గాను 295 మంది హాజరై 82 మంది పరీక్షకు హాజరు కాలేదని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి పరీక్షా 2 కేంద్రాల్లో, మూడు స్క్వాడ్ బృందాలు 8 పరీక్ష కేంద్రాలను తనిఖీ చేయడమైనది. పరీక్షలో ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని ప్రశాంత వాతావరణంలో ఎస్ ఎస్ సి సప్లమెంటరీ పబ్లిక్ పరీక్షలు ఓపెన్ స్కూల్ పరీక్షలు జరిగాయని తెలిపారు.


RNI No Tel / 2012 /4241
హైదరాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER · తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
31 ఆదివారం మే 2026

## విద్యుత్ కోతలపై వినతి పత్రాన్ని పర్యవేక్షణ ఇంజనీర్ కి సమర్పించిన.....

## తెలుగుదేశం పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్



పట్టణంలో గత కొన్ని వారాలుగా విద్యుత్ శాఖ వారు అప్రకటితంగా విధిస్తున్న విద్యుత్ కోతలపై వినతి పత్రాన్ని పర్యవేక్షణ ఇంజనీర్ కి తెలుగుదేశం పార్టీ ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షులు దాడి రత్నాకర్ అందజేశారు. ఈ సందర్భంగా దాడి రత్నాకర్ మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ కోతలు లేవు సరిపడా విద్యుత్ ప్రజలకు అందించగలుగుతున్నామని రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు స్పష్టంగా చెప్పి ఉన్నారని అన్నారు. దానికి భిన్నంగా అనకాపల్లి జిల్లా అనకాపల్లి పట్టణంలో గత 20 రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలను విధిస్తున్నారని ఈ విషయమై డివిజన్ 1 ఏఈ , డివిజన్ 2 ఏఈ స్పందించడం లేదని అన్నారు. విద్యుత్ కార్యాలయంలో ప్రజలు అడిగితే స్పందించే అధికారి కూడా కరువయ్యారని అన్నారు. అర్ధరాత్రి వేళల్లో విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు ఉండే చోట ఈ పరిస్థితి మరి ఇబ్బందికరంగా ఉందని వారు ఉక్కపోత తాళలేక రోడ్లపైకి రావలసిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువచ్చే విధంగా ఏపీ ఈపీడీసీఎల్ అధికారుల తీరు ఉండడం చేత దాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. అందుచేత ఏపీ ఈపీడీసీఎల్ సూపరిండెండెంట్ ఇంజనీర్ అధికారి వారికి స్వయంగా కలిసి చెప్పడం జరిగిందని అన్నారు. అనకాపల్లి జిల్లా అయిన తర్వాత అనేక వాణిజ్య పరిశ్రమలు ఇక్కడకు వస్తున్నాయని లక్షల కోట్లు పెట్టుబడులు వస్తున్నాయని ఈ సమయంలో ఇటువంటి విద్యుత్ కోతల వల్ల వారికి సంకోచం ఏర్పడి ప్రభుత్వానికి చెడ్డ పేరు వచ్చే విధంగా అధికారుల తీరు ఉందని అన్నారు. ముఖ్యంగా నివాస గృహాలు ఉండే ప్రాంతాల్లో కరెంటు కోతల వల్ల సామాన్య ప్రజలు కేవలం కరెంటుపై ఆధారపడుతూ మండువేసవిలో ఇళ్లలోనే ఉండే ప్రజలు కరెంటు లేక తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారని ఇటువంటి వేసవికాలంలో బయటికి రావద్దని ప్రభుత్వాలు హెచ్చరిస్తున్నాయని అటువంటి పరిస్థితుల్లో కరెంటు లేకపోతే ప్రజలు ఎలా ఉండగలుగుతారు అని అన్నారు. ఇక్కడ ప్రజలు సామాన్య మధ్యతరగతి వారిని వారి ఇళ్లల్లో చాలామందికి జనరేటర్లు గాని, ఇన్వెర్టర్లు గాని లేవని అన్నారు. రాబోయే రెండు రోజుల్లో విద్యుత్ కోతల సమస్యను పరిష్కరించాలని మరియు లో వోల్టేజ్ సమస్య వల్ల గృహాల్లో ఉండే విలువైన విద్యుత్ ఉపకరణాలు దెబ్బతింటున్నాయని ఈ సమస్యను వెంటనే పరిష్కరించాలని అన్నారు. అవసరమైన చోట కొత్త ట్రాన్స్ఫార్మర్లను వేయవలసిందిగా కోరడం జరిగిందని దానికి వారు స్థల సమస్యను తమ దృష్టికి తీసుకువచ్చారని ఎక్కడైతే ఎటువంటి సమస్య ఉందో దానిని తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని అన్నారు. రేపు జిల్లా వ్యాప్తంగా అధికారులు సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలియజేయడం జరిగిందని అన్నారు. విద్యుత్ శాఖలో ఏఈల తీరును తీవ్రంగా తప్పు పట్టడం జరిగిందని రాబోయే రెండు రోజుల్లో సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు కొణతాల భాస్కర్, కర్రి అప్పాజీ, పొలిమేర నాయుడు, దాడి ఆదినారాయణ,కోరబిల్లి రుద్ర, కోరుమిల్లి పరమేశ్వరరావు,కోటిపల్లి శ్రీను,కొణతాల పరదేశి నాయుడు, పెంటకోట కోదండపాణి, బుద్ధ శ్రీను, వేగి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు,




## ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్ షాపింగ్ కాంప్లెక్స్ కు ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలి...



స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజల ఎన్టీఆర్ మార్కెట్ యార్డ్ షాపుల యజమాన్యం నుంచి సమస్య సంబంధించిన వినతి పత్రాం స్వీకరించారు. షాపుల యాజమాన్యం కరెంటు లోడ్ సరిపడక ప్రత్యేకమైన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ సమస్యలను శ్రద్ధగా విన్న అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రామ్కి వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి మాజీ మంత్రివర్యులు అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కి తెలియజేశారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా, ప్రజల సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలబడుతుందని ఆయన తెలియజేశారు.

## ప్రజా సమస్యల వినతులు స్వీకరిస్తున్న....రాంకీ



స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజల మరియు కూటమి కార్యకర్తలు నుండి వారి సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి భీమర శెట్టి రాంకీ స్వీకరించారు. వచ్చిన సమస్యలను శ్రద్ధగా విన్న భీమరశెట్టి రామ్కి వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి మాజీ మంత్రివర్యులు , శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లి అతి త్వరలోనే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు, కార్యకర్తలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా, ప్రజల సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలబడుతుందని ఆయన తెలియజేశారు.


## జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాలపై ఆకస్మిక తనిఖీలు



జిల్లాలోని అన్ని ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించబడుతున్నాయా అనే అంశంపై జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ఆకస్మిక తనిఖీలు చేపట్టిందని జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు అన్నారు. సర్వశిక్ష అభియాన్, విద్యాకానుకలతో పాటు పాఠశాలల నిర్వహణ, మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను అధికారులు పరిశీలించారు.

ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు మాట్లాడుతూ, ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలలను నిర్వహిస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థుల భద్రత, పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, తరగతి గదుల నిర్వహణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు.అలాగే జిల్లాలోని ప్రతి పాఠశాలలో నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నామని, నిబంధనలను ఉల్లంఘించే యాజమాన్యాలపై శాఖాపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. విద్యార్థుల సంక్షేమమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

## మంత్రాలయం వద్ద విషాదం.. తుంగభద్రలో ఐదుగురు గల్లంతు



కర్నూలు జిల్లాలోని పుణ్యక్షేత్రం మంత్రాలయం వద్ద తీవ్ర విషాదం చోటుచేసుకుంది. నిన్న సాయంత్రం తుంగభద్ర నదిలో స్నానానికి దిగిన ఐదుగురు వ్యక్తులు గల్లంతయ్యారు. వీరిలో ఐదేళ్ల బాలుడు కూడా ఉండటంతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు, గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు.పోలీసుల కథనం ప్రకారం, ఒకే కుటుంబానికి చెందిన బంధువులు మంత్రాలయంలో సత్యనారాయణ స్వామి వ్రతం కోసం హాజరయ్యారు. పూజ ముగిసిన తర్వాత, వారిలో ఆరుగురు సరదాగా స్నానం చేసేందుకు తుంగభద్ర నదిలోకి దిగారు. అయితే, నదిలో నీటి లోతును అంచనా వేయడంలో విఫలమవ్వడంతో పాటు, ప్రవాహం వేగంగా ఉండటంతో వారు నీటిలో కొట్టుకుపోయారు. ఈ ప్రమాదం నుంచి ఆదోనికి చెందిన అపర్ణ అనే మహిళ సురక్షితంగా బయటపడగా, మిగిలిన ఐదుగురు గల్లంతయ్యారు.గల్లంతైన వారిని హైదరాబాద్‌కు చెందిన సతీష్ (35), అతని కుమారుడు యువన్ చంద్ర (5), అనంతపురం జిల్లా ఉరవకొండకు చెందిన సంధ్య (22), మంత్రాలయానికి చెందిన రాఘవేంద్ర (25), ధను (23)గా గుర్తించారు. గత రాత్రి పొద్దుపోయే వరకు గజ ఈతగాళ్లు, స్థానిక జాలర్ల సహాయంతో గాలింపు చర్యలు కొనసాగించారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం అధికారులు ముమ్మరంగా ప్రయత్నిస్తున్నారు. ఈ ఘటనతో బంధువుల ఇంట తీవ్ర విషాదం నెలకొంది.

RNI No Tel / 2012 /4241
ప్రతి అక్షరం.. ప్రజల పక్షం..
హైద్రాబాద్ ఎస్టేట్
THE LARGEST CIRCULATED TELUGU NEWS PAPER
తెలుగు దిన పత్రిక
hyderabadestate.co.in
31 ఆదివారం మే 2026


## కాలేజీల్లో సినిమా ప్రమోషన్స్ దండగ..

## డిజిటల్ మీడియానే ముఖ్యం: పృథ్వీరాజ్



'30 ఇయర్స్ ఇండస్ట్రీ' డైలాగ్‌తో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సీనియర్ నటుడు పృథ్వీరాజ్ తాజాగా మూవీ ప్రమోషన్స్ విధానంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తాజాగా జరిగిన 'రిస్క్' సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన... ప్రస్తుత చిత్ర పరిశ్రమలో ప్రచారాల పేరిట జరుగుతున్న ట్రెండ్‌ను తీవ్రంగా తప్పుబట్టారు. ఈ మధ్య కాలంలో ప్రతి ఒక్కరూ సినిమా ప్రమోషన్స్ అంటూ భారీగా ఖర్చు చేస్తూ, కాలేజీల చుట్టూ తిరుగుతూ స్టూడెంట్స్‌ను కలుస్తున్నారని పృథ్వీరాజ్ పేర్కొన్నారు. అయితే, అక్కడ గోల, ఈలలు, అరుపులు తప్ప.. ఒక్క విద్యార్థి కూడా తర్వాత థియేటర్ కి వచ్చి సినిమా చూడటం లేదని ఆయన తన వ్యక్తిగత అభిప్రాయాన్ని తెలియజేశారు. కాలేజీలకు వెళ్లి ప్రమోషన్ల పేరిట డబ్బును వృథాగా తగలెయ్యద్దని ఆయన సూచించారు. ఆ ఖర్చుకు బదులుగా డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను సరైన పద్ధతిలో ఉపయోగించుకుని, సినిమాను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని హితవు పలికారు.

## సీఎం విజయ్ కుమారుడి సినిమా రిలీజ్ డేట్ వచ్చేసింది!





తమిళ స్టార్ హీరో, తమిళనాడు ముఖ్యమంత్రి థలపతి విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న 'సిగ్మా' సినిమా విడుదల తేదీ ఖరారైంది. ఈ చిత్రాన్ని జూలై 31న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ అధికారికంగా ప్రకటించింది. ఈ విషయాన్ని లైకా ప్రొడక్షన్స్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. "సిగ్మా జూలై 31న థియేటర్లలోకి వస్తోంది. ఈ అద్భుతమైన ప్రయాణానికి సిద్ధంగా ఉండండి" అని పోస్ట్ చేసింది. తెలుగు యంగ్ హీరో సందీప్ కిషన్ ఈ సినిమాలో కథానాయకుడిగా నటిస్తుండటం విశేషం. తమిళ, తెలుగు భాషల్లో ఏకకాలంలో ఈ చిత్రం రూపొందుతోంది. ఫరియా అబ్దుల్లా ఓ ముఖ్య పాత్రలో నటిస్తుండగా, తమన్ సంగీతం సమకూరుస్తున్నారు. యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్‌గా ఈ సినిమా ఉండబోతోందని సమాచారం.

25 ఏళ్ల జేసన్ సంజయ్, కెనడా మరియు లండన్‌లలో ఫిల్మ్ మేకింగ్ కోర్సులు పూర్తి చేసిన తర్వాత దర్శకత్వం వైపు అడుగులు వేశారు. 2023 ఆగస్టులో ప్రకటించిన ఈ సినిమా షూటింగ్ 65 రోజుల్లో పూర్తయింది. గతేడాది డిసెంబర్‌లో విడుదలైన టీజర్‌కు మంచి స్పందన లభించింది. సుభాస్కరన్ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపుకుంటోంది. విజయ్ కుమారుడి తొలి సినిమా కావడంతో దీనిపై ప్రేక్షకుల్లో, ఇండస్ట్రీలో మంచి ఆసక్తి నెలకొంది.

## నేను ఇప్పటివరకు చేయని పాత్ర ఇది

## : 'పెద్ది' గురించి రామ్ చరణ్




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ తన తాజా చిత్రం 'పెద్ది'లోని పాత్రపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బుచ్చిబాబు దర్శకత్వంలో రూపుదిద్దుకున్న ఈ స్పోర్ట్స్ డ్రామాలో తాను పోషించిన పాత్ర తన కెరీర్‌లోనే పూర్తి భిన్నమైనదని ఆయన తెలిపారు. ఈ సినిమాతో నటుడిగా ఎన్నో విషయాలు నేర్చుకున్నానని వెల్లడించారు. జూన్ 4న విడుదల కానున్న 'పెద్ది' ప్రమోషన్లలో భాగంగా బాలీవుడ్ మీడియాతో చరణ్ మాట్లాడారు. "పెద్ది సినిమాలో నేను చేసిన పాత్ర నా కెరీర్‌లో ఇప్పటివరకు చేయలేదు. ఇది పూర్తిగా భిన్నమైనది. ఈ సినిమాలో చాలా మంది గొప్ప నటులతో కలిసి పనిచేయడం వల్ల ఎన్నో విషయాలు నేర్చుకునే అవకాశం దొరికింది" అని రామ్ చరణ్ వివరించారు. ఈ చిత్రంలో రామ్ చరణ్ నటన అద్భుతంగా ఉంటుందని చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖ నటుడు బొమన్ ఇరానీ, రామ్ చరణ్ గురించి ప్రశంసలు కురిపించారు. ఈ సినిమాలో చరణ్ మూడు రకాల క్రీడలు (కుస్తీ, క్రికెట్, రన్నింగ్) ప్రదర్శించారని, నాలుగో 'ఆట'గా డ్యాన్స్‌తో అదరగొట్టారని తెలిపారు. గుర్తింపు కోసం ఒక వ్యక్తి ఎంత దూరమైనా వెళ్లగలడని ఈ సినిమా నిరూపిస్తుందని బొమన్ ఇరానీ అన్నారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కీలక పాత్రలో నటిస్తుండగా, సినిమా విడుదల తేదీ దగ్గర పడుతుండటంతో ఈ వ్యాఖ్యలు అంచనాలను మరింత పెంచుతున్నాయి.

## సార్ ముందు మనసు విప్పి మాట్లాడేందుకు ఎదురుచూస్తున్నా: బండ్ల గణేష్

ప్రముఖ నటుడు, నిర్మాత బండ్ల గణేష్ మరోసారి పవర్ స్టార్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై తనకున్న ప్రగాఢ అభిమానాన్ని చాటుకున్నారు. పవన్ గురించి మనసు విప్పి మాట్లాడే అవకాశం కోసం తాను ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నానని ఆయన అన్నారు. ఆ రోజు వచ్చినప్పుడు పవన్ గొప్ప మనసు, వ్యక్తిత్వం గురించి తనకు తెలిసిన నిజాలను ప్రపంచం ముందు గర్వంగా చెబుతానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బండ్ల గణేష్ మాట్లాడుతూ, "పవన్ కల్యాణ్ సార్ గురించి నాకు తెలిసిన నిజాలను, ఆయన క్యారెక్టర్‌ను, ఆయన నైజాన్ని ప్రపంచానికి చెప్పే అవకాశం కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నాను. పదవులు, హోదాలు కాదు.. మనిషి విలువ అతని ప్రవర్తన, మాట, మనసులో ఉంటుందని నిరూపించిన వ్యక్తి ఆయన" అని ప్రశంసించారు. అలాంటి మహోన్నత వ్యక్తి గురించి తన హృదయంలో ఉన్న గౌరవాన్ని వ్యక్తపరిచే ఆ క్షణం కోసం వేచి చూస్తున్నట్లు బండ్ల గణేష్ తన వ్యాఖ్యల్లో తెలిపారు. పవన్ కల్యాణ్ పట్ల బండ్ల గణేష్ కు ఉన్న అభిమానం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. పలు సందర్భాల్లో ఆయన పవన్ ను దేవుడిగా అభివర్ణించిన విషయం తెలిసిందే. పవన్ కల్యాణ్ ఇవాళ నాయుడుపేటలోని జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ను సందర్శించిన సందర్భంగా బండ్ల గణేష్ ఈ ట్వీట్ చేశారు.



# ఎర్రటి చీరలో చిట్టి ఫరియా అబ్దుల్లా రచ్చ..

## ఫోటోలు చూస్తే ఫ్యూజులు ఎగిరిపోవాల్సిందే!



టాలీవుడ్ లో జాతి రత్నాలు సినిమాలో 'చిట్టి' పాత్రతో తెలుగు ప్రేక్షకుల మనసు దోచుకుంది హైదరాబాదీ బ్యూటీ ఫరియా అబ్దుల్లా. తన పొడుగు కాళ్ల అందంతో, నేచురల్ యాక్టింగ్‌తో కుర్రకారును పడేసిన ఈ ముద్దుగుమ్మ, తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోలు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. ఎప్పుడూ క్యూట్‌గా కనిపించే ఫరియా, ఈసారి ఎర్రటి చీరలో క్లాసీ అండ్ హాట్ లుక్‌తో దర్శనమిచ్చింది. ఈ రేంజ్ గ్లామర్ ట్రీట్ చూసి ఫ్యాన్స్ ఫిదా అయిపోతున్నారు.

ఎర్రటి చీరలో మెరిసిపోయిన పొడుగుకాళ్ల సుందరి:

ఫరియా అబ్దుల్లా తాజాగా ఒక ఈవెంట్ కోసం ట్రెడిషనల్ లుక్‌ను ఎంచుకుంది. ముదురు ఎరుపు రంగు శారీలో ఆమె దేవకన్యలా మెరిసిపోయింది. ఈ చీరకు మ్యాచింగ్‌గా హెవీ వర్క్ ఉన్న స్లీవ్‌లెస్ బ్లౌజ్‌ను ధరించింది. ఈ బ్లౌజ్ డిజైన్ 'స్వీట్‌హార్ట్ నెక్ లైన్'తో ఉండటం వల్ల ఆమె లుక్‌కు మోడ్రన్ టచ్ వచ్చింది. 'ఎమ్‌ప్రా అఫీషియల్' బ్రాండ్ నుండి వచ్చిన ఈ అవుట్‌ఫిట్‌ను ఐశ్వర్య అనే స్టైలిస్ట్ ఎంతో అందంగా డిజైన్ చేశారు.

స్పెషల్ ఇయరింగ్స్.. కిల్లింగ్ లుక్స్:

ఈ ఎరుపు రంగు చీర అందాన్ని మరింత పెంచేలా 'షోల్డ్‌షేర్నీ' బ్రాండ్‌కు చెందిన ట్రెడిషనల్ స్టేట్‌మెంట్ ఇయర్ రింగ్స్ ధరించింది. ఫరియాకు ఉన్న పొడవాటి జుట్టు, ఆకర్షణీయమైన కళ్ళు ఈ ఫోటోలలో మరింత హైలైట్ అయ్యాయి. ఇక తన కిల్లింగ్ ఎక్స్‌ప్రెషన్స్‌తో కెమెరాకు ఇచ్చిన పోజులు చూస్తుంటే మాస్‌గా చెప్పాలంటే నెటిజన్లకు ఫ్యూజులు ఎగిరిపోతున్నాయి.

కెరీర్‌లో ఒడిదుడుకులు ఎదురైనా మళ్లీ ఫామ్‌లోకి వచ్చిన ఫరియా జాతి రత్నాలుతో వచ్చిన క్రేజ్‌ను నిలబెట్టుకుంటూ, గత ఏడాది విడుదలైన 'గుర్రం పాపిరెడ్డి'తో మరో హిట్‌ను ఖాతాలో వేసుకుంది. అలాగే ఈ ఏడాది మే 1న థియేటర్లలో విడుదలై, ప్రస్తుతం ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ 'అమెజాన్ ప్రైమ్'లో విజయవంతంగా స్ట్రీమింగ్ అవుతున్న 'గాయపడ్డ సింహం' సినిమాలోనూ హీరోయిన్‌గా నటించి మంచి మార్కులు కొట్టేసింది. ఈ చిత్రంలో ప్రముఖ దర్శకుడు, నటుడు తరుణ్ భాస్కర్ హీరోగా నటించగా, శ్రీవిష్ణు, జేడీ చక్రవర్తి ఇతర ముఖ్య పాత్రలు పోషించారు.

మొదట్లో కేవలం క్యూట్ బ్యూటీగా పేరు తెచ్చుకున్న ఫరియా, ఇప్పుడు రూట్ మార్చి బోల్డ్ అండ్ స్టైలిష్ ఫోటోషూట్స్‌తో గ్లామర్ డోస్ పెంచేస్తోంది. ఈ లేటెస్ట్ రెడ్ శారీ లుక్‌తో సోషల్ మీడియాను తన వైపు తిప్పేసుకున్న ఈ చిట్టి, రాబోయే రోజుల్లో మరిన్ని వైవిధ్యమైన పాత్రలతో టాలీవుడ్‌లో దూసుకుపోవాలని ఆశిద్దాం.

# కాజల్ గ్లామర్ డోస్ డబుల్..

## లేటెస్ట్ లుక్ చూసి ఫ్యాన్స్ మంత్రముగ్ధులు !



టాలీవుడ్ చందమామ కాజల్ అగర్వాల్ పెళ్లి, బాబు పుట్టిన తర్వాత కాస్త హోమ్లీగా కనిపిస్తూ వచ్చింది. కానీ తాజాగా ఆమె సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు చూస్తే ఎవరైనా ముక్కున వేలేసుకోవాల్సిందే! గ్లామర్ డోస్ పెంచి సరికొత్త బోహో-చిక్ లుక్‌లో నెటిజన్ల మైండ్ బ్లాక్ చేసింది. 'హవ్ ˉవఎజూం ఎవ శ్రీఖఎశీబతీ' (ప్రేమ కాలం) అంటూ ఫ్రెంచ్ క్యాప్షన్‌తో కాజల్ వదిలిన ఈ ఫోటోలు ఇప్పుడు ఇంటర్నెట్‌ను షేక్ చేస్తున్నాయి. ఆ హాట్ అప్‌డేట్స్ చూద్దాం..



కాజల్ కాక రేపుతున్న కాకతీయం లుక్:

తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్టులో కాజల్ అగర్వాల్ ఎవరూ ఊహించని రేంజ్‌లో స్టైలిష్‌గా కనిపించింది. ఆమె వైట్ కలర్ స్లీవ్‌లెస్ క్రోచెట్ ఓపెన్-నిట్ హాల్టర్ టాప్ ధరించింది. జియోమెట్రిక్ డిజైన్‌తో ఉన్న ఈ టాప్‌కు మ్యాచింగ్‌గా లైట్-వాష్ డిస్ట్రెస్డ్ డెనిమ్ షార్ట్స్ వేసుకుంది. ఈ మోడ్రన్ సమ్మర్ లుక్‌లో కాజల్ అందాలు నెటిజన్లకు అస్సలు నిద్రపట్టనివ్వడం లేదు.

టాలీవుడ్‌ను ఏలిన చందమామ:

ఒకప్పుడు టాలీవుడ్‌లో కాజల్ హవా ఏ రేంజ్‌లో ఉందో అందరికీ తెలిసిందే. టాప్ హీరోల సినిమా వస్తోందంటే ఫస్ట్ ఛాయిస్ కాజలే ఉండేది. ఇక కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పుడే ముంబై బిజినెస్‌మెన్ గౌతమ్ కిచ్లూను పెళ్లాడి, ఆ తర్వాత బాబుకు జన్మనిచ్చింది. ఇక ఫ్యామిలీ కోసం కొంతకాలం సినిమాలకు బ్రేక్ ఇవ్వడంతో అమ్మడి స్పీడ్ కాస్త తగ్గింది.

సెకండ్ ఇన్నింగ్స్‌లో లక్ కుదిరింది:

పెళ్లి తర్వాత మళ్లీ మునుపటి రేంజ్ ఆఫర్లు అందుకోవడం అంత ఈజీ కాలేదు. కానీ, టాలెంట్ ఉన్న బ్యూటీని లక్ ఎక్కువ కాలం దూరం పెట్టలేదు కదా! రీసెంట్‌గా కాజల్ ఖాతాలో కొన్ని భారీ ప్రాజెక్ట్స్ పడ్డాయి. ఇక బాలీవుడ్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా వస్తున్న 'రామాయణం' మూవీలో రావణాసురుడి భార్య 'మండోదరి' లాంటి పవర్ ఫుల్ పౌరాణిక పాత్రను కాజల్ దక్కించుకుంది.

టాలీవుడ్‌లో మాస్ గాడ్‌తో గోల్డెన్ ఛాన్స్:

కేవలం బాలీవుడ్ మాత్రమే కాదు, టాలీవుడ్‌లోనూ క్రేజీ ఆఫర్ కొట్టేసింది. నందమూరి బాలకృష్ణ, డైరెక్టర్ గోపీచంద్ మలినేని కాంబినేషన్‌లో వస్తున్న హై-వోల్టేజ్ మాస్ యాక్షన్ సినిమాలో కాజల్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇక వీటితో పాటు సమాజంలో జరిగే ఫెర్టిలైజర్స్ స్కామ్ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న 'ది ఇండియా స్టోరీ' అనే సోషల్ థ్రిల్లర్‌లో కూడా లీడ్ రోల్ చేస్తోంది.

ఒకపక్క పవర్‌ఫుల్ సినిమాలు చేస్తూనే, మరోపక్క ఇలాంటి హాట్ ఫోటోషూట్లతో తనేంటో నిరూపిస్తోంది కాజల్. పెళ్లై బాబు పుట్టినా తనలోని గ్లామర్ ఈసుమంతైనా తగ్గలేదని ఈ ఫోటోలతో ప్రూవ్ చేసింది. కెరీర్ పరంగా ఈ సెకండ్ ఇన్నింగ్స్ ప్రాజెక్టులు, ఈ రేంజ్ గ్లామర్ రచ్చ చందమామకు ఏ రేంజ్‌లో ప్లస్ అవుతాయో చూడాలి.